

నిప్పులు కురిపిస్తున్న మార్తాండుకళ్లు హొప్పెట్టి సగం మూతపడేసరికి ఎండ తీవ్రత తగ్గింది. బిగిసిన నరాల్ని వదులుచేసుకుంటూ గడియారం అయిదు కొట్టింది. వాతావరణం ముఖంమీద నీళ్లు జల్లుకుని చల్లబడసాగింది. వేడికి జడిసి దాక్కున్న గాలి నెమ్మదిగా బయటికొచ్చి స్వేచ్ఛగా ఊపిరి వదలింది. ప్రకృతిలో కలుగుతున్న ఈ మార్పుల్ని గమనించకుండా, సీత హాయిగా నిద్రపోతోంది .... అన్వేషించి, అన్వేషించి దొరకనివస్తువు దొరికితే — చేరని గమ్యస్థానం చేరుకోగలిగితే—కలిగే ఆనందంతో నిండిన స్వప్న జగత్తులో మునిగిపోయింది.

శంకరం కాలుకాలిన పిల్లిలా అటూ యిటూ పచార్లు చేశాడు.

మధ్యాహ్నం రెండింటికి 'చిన్న కునుకు' తీస్తానంటూ పడుకున్న ఈ సీత కుంభకర్ణుడి వారసురాలా ఏమిటి ? మూడు నాలుగు సార్లు నిద్రను చెదరగొడదామని అనుకున్నా, ముఖం మీద చిందులాడే చిరునవ్వును చూచి ఆగిపోయాడు. నిజజీవితంలో దొరకని తృప్తి స్వప్నంలో దొరికితే తనెందుకు అడ్డుపడాలి ? బాధ్యత బరువుతో ఊపిరిసలపని విశ్వబ్రహ్మం. ఒక్కనాడైనా హాయిగా విహరిద్దామని ఎక్కడికో పోయిందిగామోలు; బయట ఒకటే కోలాహలం — నిరంతర ప్రవాహంలా, గలగలమన్న మువ్వలచప్పుడు — 'శంభో మహాదేవా !' అంటూ కంటి కెదురుగా పార్వతీనాథుడు కనిపించకపోయినా, మనసులో అతనిరూపాన్ని స్వచ్ఛంగా, నిర్దుష్టంగా, నిర్మలంగా ఊహించుకుని భక్తులు కదలిపోతున్నారు. ఆ సమయంలో అతన్నేదో అయస్కాంత శక్తి ఆకర్షించింది. ఇంక ఉండబట్టలేకపోయాడు. ఏడాది కోమారు వచ్చే పర్వదినం—ఆనాడు కూడా ఈ నిద్ర ? ....

'సీతా ! .... సీతా ! .... ఏమిటే అకాల నిద్ర ?' అంటూ పదిసార్లు అటూ యిటూ కదిపేసరికి ఆమె మేలుకుంది.

# జీవిత కలహం

## ఆర్.యమ్.చిదంబరం



'వచ్చారూ ! .... మీ కోసమే ఎదురు చూస్తున్నా—చూడండి ! .... ఈ బాబు ఒంటరిగా తీర్థానికి వెడతానంటున్నాడు. ఈ జనసమ్మర్దంలో తప్పిపోతే ఎక్కడని వెదకగలం ? .... ఇంకా నయం ! రథం కూడా లాగేస్తాడటండోయ్ ! కొంటె వెధవ ! .... కాస్త మందలించండి' అంది చిరుకోపంతో—ఆమెను పట్టిన నిద్ర ఇంకా తెర వెనక్కి జారుకోలేదు.

శంకరం ముఖం వాడిపోయింది.

బాబుకోసం అతను వెదకలేదు. ఎక్కడున్నాడో చూపెట్టమని సీతను అడుగనూ లేదు. అది ఉండి, లేని పుట్టుక మిథ్యా బింబానికున్న జీవం దానికి ఉంది. సీత దృష్టిలో బాబు, శ్రీరాముడికి మల్లే సర్వలక్షణ సమన్వితుడు. కృష్ణుడికి మల్లె కొంటెవాడు .... కాని అతని రూపం సీతకుమాత్రమే కనుపిస్తుంది. చిరకాలంగా మనసులో ఊరి ఊటలు వేసి, పిల్ల ప్రవాహాలలో చెలిమిచేమిరద్దై, మహానదై, సముద్రమైన మూగబాధ అది. అది ఏ రూపంలో ఎప్పుడు బయటపడుతుందో, ఏయే శక్తుల్ని ముంచివేస్తుందో ఎవరూ చెప్పలేరు.

'నీ కింకా ఆపిచ్చి పోలేదన్నమాట !' అని నిట్టూర్చాడు శంకరం — సీత గది నాలుగువేపులా పరీక్షగా చూసింది.

'అంతా కలన్నమాట ! ....' అని అతని నిట్టూర్పును అందిపుచ్చుకుంది.

'నూటికి నూరువంతులు మిథ్య ! .... ఎందుకీ లేనిపోని ఆశలు ? మనకు ఎంత రాసిపెట్టి ఉందో అంతే !'

'చక్కటి కలనుమండి ! మీరే కలచివేశారు. బాబు అప్పుడే బడినుండి వచ్చాడు. ఎంత బాగున్నాడనుకున్నారు ? ఎర్రటి బుగ్గలు, పెద్ద కళ్ళు, బొద్దుగా, అందంగా, ఆరోగ్యంగా ఉన్నాడు. నా కంటి కింకా కనిపిస్తూనే ఉన్నాడు.'

౬౯—వ పేజీ చూడండి

'లేదు సీతా లేదు! .... కరిగిపోయాడు .... అది సరేకాని ఇవేళ శివరాత్రి. అదైనా జ్ఞాపకం ఉందా? స్వామి దర్శనం చేసుకువద్దాం—పద.'

'సాంబశివా! ....' అంటూ భక్తకోటి కదలి పోతోంది.

'మన బాబు వస్తాడా....'అనడిగింది ఆశగా? సీత.

'తప్పకుండా .... త్వరగా బయలుదేరు మరి—.'

'నేను రాను .... నాబాబు వస్తే రోజూ వచ్చి దండం పెడతాను—కావలిస్తే మీరు వెళ్లండి.'

ఆమెకు ఎంత తోస్తే అంత—ఇంక వాదించి లాభంలేదు — కారణాలు చెవికెక్కవు. చొక్కా తొడుక్కొని ఒక్కడే బయలుదేరాడు.

జనం తండోపతండాలుగా వెడుతున్నారు. ఆడ, మగ, పిల్లలు—అంతా—కొందరు రెండెడ్ల బళ్లమీద గలగలమని కదలిపోతున్నారు. వింతలు, విశేషాలు మాటల్లో దొర్లి ఉత్సాహాన్ని ఉరికింప చేస్తున్నాయి. శంకరం దృష్టి పిల్లలమీదికే పోయింది. ఎంతమంది బాలురు! బాలికలు! .... అదృష్టాన్ని అందిపుచ్చుకున్న తలిదండ్రులు ఆ గుంపులో ఎందరు! .... కాని, తను ఏకాకి— సీత కూడా అంతే. ఇద్దరూ కలిసినా మిగిలేది ఏకత్వమే! ఒకే లోపంతో, ఒకే బాధతో మన సులో మమకారాన్ని ఘనీభవింపజేసే ఏకత్వం! .... భేదించలేని కోటలాంటిది. ఈ ఒంటరితనం మనుష్యుల సంఖ్యమీద ఆధారపడదు.

శంకరం ఆలోచనల్ని అదుపులో ఉంచి వడివడిగా నడిచాడు. రకరకాలైన బజారాలు, బెలూనులు, బొమ్మలు, డోలుబళ్లు, అదో పిల్లల ప్రపంచం. అన్నింటిని వింటూ, చూస్తూ నడుస్తున్నాడు. దూరంగా శివుడి గుడిగోపురం గర్వంగా తలెత్తి చూస్తోంది.

'నాన్నా! .... నాన్నా!' అంటూ ఎవరో అతని పంచె పట్టుకున్నారు.

శంకరం ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. అయి దేళ్ల అబ్బాయొకడు అతన్ని ఆపివేశాడు. ఆశ్చర్యం లోంచి తేరుకొని, నిజానిజాలు తెలుసుకునేలోగా ఎవరో వచ్చి అతన్నెత్తుకున్నారు.

'చేయి విదలించుకుని ఎక్కడికిరా పరుగెడు తున్నావ్ గాడిదా?' అంటూ ఆ వ్యక్తి చెవి మెలి పెట్టాడు. ఆ అబ్బాయి తండ్రై ఉంటాడు.

'నాన్నా! .... నాన్నా! ....' అన్న పిలుపు శంకరం చెవిలో ప్రతిధ్వనించింది.

ఎంత తియ్యటి పిలుపు! ఈ పిలుపుకోసమే తను ఇరవై ఏళ్ళుగా ఎదురుచూస్తున్నాడు.

నెమ్మదిగా నడుద్దా మనుకున్నా, భక్తిపార వశ్యంతో కదలిపోతున్న ఆ జనప్రవాహం 'నీల కంఠా' అంటూ అతన్ని ముందుకు నెట్టుకు పోయింది.

లక్కపిడతలు .... ఎర్రగా, నిగనిగ లాడుతూ చిన్నపిల్లల్ని ఆకర్షిస్తున్నాయి. శంకరానికి హఠా త్తుగా జ్ఞప్తికొచ్చింది.

ప్రతిశివరాత్రికి సీ బుట్టెడు లక్కపిడ తలు తీసికెళ్లటం అలవాటు. సీత అవన్నీ బాబు కోసమే నంటుంది.

# నిండిన జీవితకలశం

9వ పేజీ తరువాయి

'చూడండి! .... ఆడదానిలా లక్కపిడతలతో ఆడుకుంటూ నంటున్నాడు. చివరికి వంటవాడై పోతాడు ....' అంటుంది సీత.

'ఆడదానిలా ఆడుకునేవారంతా వంటవా ళ్లవు తారా ఏమిటి? .... అయినా నీ కొడుకు నల భీముల్ని మించిపోతాడులే!' అని ఊరిస్తా డతను.

రూపాయిచ్చి బుట్ట తీసుకున్నాడు.

పక్కనే ఓ ముసిల్ది — చిన్నపిల్ల—తన వస్తు వును ఎవరో దొంగిలించి తీసుకుపోతున్నట్టు శంకరం చేతిలో ఉన్న బుట్టకేసి చూపింది.

'బామ్మా! .... అవి నాకూ కావాలి!' అంది కళ్లు మరింత పెద్దచేస్తూ.

ముసిల్దానికి నడిచేందుకు, ఇంటిపనులు చేసేందుకు వంటో శక్తిలేకపోయినా మనవరాల్ని దబదబ బాదేందుకు మాత్రం కావలసినంత బలం ఉంది. ధారగా కళ్లవెంబడి కారుతున్న నీటిని చూసి అతను చలించిపోయాడు.

"ఏమండీ! మీ అబ్బాయికి మాటలువచ్చాయా?"

"రావటమా! వాడి నోరు ఎలా మూయించాలో తోచక చస్తుంటే"

వి. సుబ్బారావు (నిడుబ్రోలు)

చావ బాదేందుక్కూడా ఈ లోకంలో పిల్ల లున్నారా?

'ఇంద .... ఏడవకు .... ఈ పిడతలు తీసుకో!' అంటూ బుజ్జగించాడు.

ముసిల్ది మందహాసంచేసింది.

'మీ పిల్లలు చల్లగా ఉండాలి బాబూ!' అంది ఆనందంతో.

శంకరం ముందుకి సాగిపోయాడు.

ముసిల్దాని చివరి మాటలు చెవుల్లో ప్రతి ధ్వనిస్తే పదే పదే నవ్వొచ్చింది.

తన కసలు సంతానం లేదు. తన 'పిల్లలు' చల్లగా ఉండాలిట! .... అందులోఉన్న బాధా పూరిత హాస్యాన్ని తలుచుకుని, వికటంగా, పెద్దగా, శివుడుకూడా అదిరిపడేలా నవ్వాలనిపించింది.

రంగురంగుల తోరణాలతో, దీపాలతో, అందంగా తయారైన రథం దగ్గరై దూరమైంది. ఆగుంపులో ఎందరో పిల్లలు—ప్రతి ఒకరూ సీత దృష్టిలో మెదిలే బాబులా కనిపించారు. అతనికి ఒక్కసారిగా భయంవేసింది. ఇంకా గబగబ నడుస్తూ సందడికి దూర మయ్యాడు. కదలి కకు దూరమై నిశ్శబ్దంలో, నిర్జనప్రదేశంలో ప్రవేశించాడు. తిర్నాల హడావుడి మరో దేశంలో జరుగుతున్న యుద్ధం తాలూకు శబ్దంలా వినపడింది.

శంకరం ఓ బండరాతిమీద చతికిలబడ్డాడు. తనకోసం, లక్కపిడతలకోసం సీత ఎదురు చూస్తూ ఉంటుందన్న తలపుమొలకేలేదు.

ఉన్నట్టుండి వీధి దీపాలు ఆరిపోయాయి.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. ఆ సమయంలో అదే బాగుం దనిపించింది.

ఈ ఇరవై సంవత్సరాలదాంపత్య జీవితానికి ఫలితం? .... ఏమీలేదు. ఉదయం తొమ్మి దింటికి బడికి వెడితే సాయంత్రమే ఇంటికి తిరిగి రావటం.

'శంకరం మేష్టారు చాలా మంచివారు. ఎవర్నీ కొట్టరు' అని మెచ్చుకునే విద్యార్థులకు నిజాన్ని తెలుసుకునే శక్తి లేదు.

అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలి యదు. దూరంగా తిర్నాల జనం చేస్తున్న రొద వినిపిస్తూనే ఉంది. ఈపాటికి శివుడి రథం కదిలే ఉంటుంది.

పక్కన ఏదో అలికిడైంది.

గమనించలేదు. నిశ్శబ్దంలో ప్రకృతి భయ పెట్టడం సహజం.

మళ్లీ అలికిడైంది. ఈమారది మిథ్యకాదు. ఏదో ఆకారం కదలివచ్చి అతనిముందు నిలి చింది..... చీకటిని చీల్చివేస్తూ చూశాడు.

'ఎవరది? ....' అనడిగాడు.

'నాన్న! .... మా నాన్న! .... ఏడీ?'

శంకరం ఉలిక్కిపడ్డాడు. ఎవరో అబ్బాయి. చీకట్లో ముఖం కనపడ్డంలేదు.

'నువ్వు ఇక్కడి కెలా వచ్చావు?'

ఆ అబ్బాయి మాట్లాడలేదు. మనసులో భావాల్ని ముఖంమీద కనుక్కుందామంటే వెలుగు లేదు.

'భయపడకు! .... మీ నాన్నదగ్గరకు నేను తీసికెడతాను' అంటూ నెమ్మదిగా చేరదీశాడు. ఆ పిల్లాడి శరీరమంతా గజగజ లాడుతోంది.

'ఛీ! .... ఎందుకలా ఇదవుతావు? .... మరేం భయంలేదు. నేను మావయ్యననుకో. నేను నాన్న దగ్గరకు తీసికెడతాను.' అంటూ అత న్నెత్తు కున్నాడు. ఎవరిపిల్లాడో ఏమో!

ఉన్నట్టుండి వీధి దీపాలు ఒక్కసారిగా వెలి గాయి.

శంకరంశివుడిగుడివేపు భక్తితో చూశాడు. చీకటితో నిండిన తనహృదయంలో వెలుగు ప్రవేశించిందిగామోలు!

ఆ అబ్బాయికేసి పరీక్షగా చూశాడు. నాలుగై దేళ్లుంటాయి. ఎర్రగా, అందంగా ఉన్నాడు. నూటికి నూరువంతులు సీత ఊహలోని బాబులా ఉన్నాడు.

భయంతో జడుసుకుని ఎక్కడికైనా పారి పోయి దాక్కుందామని తాపత్రయపడుతున్న కళ్ళు, సిల్కుబట్టలు.

'నాన్న! ....' అని జ్ఞాపకంచేశా డతను.

'అవును .... నాన్నదగ్గరకే! .... పద!' అంటూ పదడుగులు ముందుకు వేశాడు.

ఆ అబ్బాయి తండ్రిని ఈ గుంపులో ఎక్కడని కనుక్కోటం? .... కనిపించిన ప్రతిమనిషిని

# నిండిన జీవితకలశం

ఇది మీ అబ్బాయేనా ?' అనడుగుతూ వెళ్లటమా ?

ఏం తోచక రెండు నిమిషాలు అలాగే నిలబడ్డాడు.

ఏదో నిర్ణయానికి రాకతప్పదు. ఆ దారంట పోతున్న ఒంటెద్దుబండిని ఆపాడు.

'నాన్న !...' అన్నాడు కుర్రాడు.

'నాన్నదగ్గరకే వెడుతున్నాం—' అంటూ బండెక్కాడు.

పదిహేను నిముషాల్లో బండి ఇంటిముందు నిలిచింది. బాడుగ ఇచ్చేసి లోపలకు వెళ్లాడు.

సీత దేవుడి పటాలముందు కూర్చుని ఎటో చూస్తోంది. అతనిరాక ఆమెకు తెలియదు.

'బాగానే ఉంది ! .... తలుపు బార్లా తెరిచి ఉంచి నీ తపస్సు—ఏ దొంగైనా, ఏదైనా ఎత్తుకుపోతే ఏం చేస్తావ్ ?' అని కసిరాడు.

'నిజమే సండోయ్ ! .... బాబు హాయిగా నిద్రపోతున్నాడు. వాడి మెళ్లో గొలుసు ఎవరైనా తెంచుకుపోతే ఏం చేయటం ?' అంటూ భర్తకేసి చూసింది.

'ఆ అబ్బాయెవరండి ? ....'

సీతముఖంలో కొత్తవెలుగు కనిపించింది.

'ఎవరో కన్నకొడుకు. దారి తప్పి ఊరిచివర పడివుంటే బుజ్జగించి తీసుకొచ్చాను. అమ్మ, నాన్న ఎవరో తెలియదు. వేలకొలది మనుష్యుల మధ్య ఎవరికని ఇతన్ని వప్పగించటం ? .... అందుకని నెమ్మదిమీద ఆలోచించి ఏదైనా చేద్దామని తీసుకువచ్చాను.

సీత పిచ్చిగా అటూ ఇటూ పరుగెత్తింది. అన్నిగదుల్లోనూ దీపాలు వెలిగించింది. శివుడి గుడి ఉన్నదిక్కుగా అర్ధనిమీలిత నేత్రాలతో, ఆనందంతో, అంజలి ఘటించింది. శంకరం అర్థంకాక అయోమయంగా చూశాడు.

'ఏమిటీ వెఱ్ఱి వేషాలు ?' అనరిచాడు.

'అయ్యో ! ఇంకా తెలియలేదటండి మీకు ? మన నోములు ఫలించాయి. ఆ శంకరుడు మనమొర విన్నాడు. మనింటో దీపాలు వెలిగాయి .... అలా చూస్తారేమండి? ఇరవైఏళ్లుగా చేస్తున్న తపస్సు ఈనాడు ఫలించింది.'

'నీ మాటలు నాకేం బోధపడటంలేదు.'

'అర్థంకాదు. అదృష్టం ఒక్కసారిగా కలిసివస్తే నమ్మలేరు. మీరు తీర్థానికి వెడుతున్నప్పుడు అన్నమాటలు నిజమయ్యాయి.' అంటూ ఆ అబ్బాయిని లాక్కుని గుండెలకు హత్తుకుంది. పదే పదే ముద్దుపెట్టుకుంది. కళ్లవెంబడి ఆనందబాష్పాల పరంపరలు — శంకరం దిగ్భ్రమ నుండి తేలుకుని, పరిస్థితుల కుడి ఎడమలు పరిశీలించాడు. అమాయకత్వం కోపానికి దాస్యం చేయదు. జాలితో, తర్కంతో లొంగదీయాలి.

'సీతా ! .... నీ బాధ నాకు తెలుసు. కాని ఆ అబ్బాయి నీకొడుకు కాడు. అతన్ని కన్న తలిదండ్రులు ఎక్కడో ఉన్నారు. వెదకి అప్పగించే భారం మనమీదుంది. రేపే పేపర్లో వేయిస్తాను. పోలీసుస్టేషనులోకి రిపోర్టు ఇస్తాను.'

సీతకళ్లు రెండూ కోపంతో గుప్పుమన్నాయి.

'మీరు మూసుకోండి ! .... అర్థంలేని ఆలోచనలూ, మీరూ — దేవుడు మనకు ప్రసాదించిన వరం ఇది. నా బాబును మరొకరికి వప్పచెప్పట మేమిటి ? ఎవరైనా వింటే నవ్విపోతారు. అతనికి వేరే తలిదండ్రులు లేరు. మనమే అన్నీ. నేను కలలు కన్న బాబు అతనే !'

అతన్ని మళ్లీ గుండెలకు దగ్గరగా అదుముకుంది. అసలే జడుసుకున్న అతను మరింత బేజారైపోయాడు. శంకరం ఆమెకేసి జాలిగా చూశాడు.

'పట్టి అమాయకురాలివి. తప్పిపోయిన పిల్లాడు దొరికినంతమాత్రాన మనవాడైపోతాడా ? రేపో మాపో, నలుగురూ నిజం కనుక్కుంటారు. ఆ కుర్రాడి తండ్రిమాత్రం ఊరుకుంటాడా ? పోలీసుకు రిపోర్టిచ్చి వెదకిస్తాడు. మనం రుజా మార్గంలో నడుచుకుంటే, సంఘం, చట్టం క్షమించి వదిలేస్తాయి.'

సీత నవ్వి ఊరుకుంది.

అంటే, ఆమె అభిప్రాయం ఇంత మారదు. మైలురాయిలా స్థిరత్వం పొందింది. ఆమెను తప్పించట మెలాగో అతనికి తెలిసిందికాదు.

అంతవరకూ మౌనంగా ఉన్న ఆ అబ్బాయి మా నాన్నదగ్గరకు తీసికెళ్లండి' అన్నాడు.

'నాన్నారు అరుగో ! .... వారే బాబూ !' అంటూ శంకరాన్ని చూపెట్టి బుజ్జగించింది. చిన్న పిల్లల్ని మోసగించటం సులభమైనా, ఎవరో దారంట పోయే దానయ్యను చూపెట్టి 'ఇతనే మీనాన్న' అంటే ఎలా నమ్ముతారు ?

'మీ నాన్న ఎక్కడున్నాడు?....'

'తీర్థంలో న న్నొదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. తరువాత నన్నెవరో ఎత్తుకుపోయారు'

శంకరానికి కొద్దిగా అర్థమైంది.

'నీ పేరు?....'

'బాబు ....!'

'అవును — అతనా .... సందేహంలేదు. ఆ శివుడే నా దగ్గరకు పంపాడు.' అంది సీత.

'కాదు — బాబు నీ కొడుకు కాడు. అనవసరంగా వెఱ్ఱి ఆశలు పెట్టుకోకు. మనకు సంతాన యోగం లేదు. మనం ఒకర్నొకరు చూసుకుంటూ బతకాల్సిందే !'

శంకరం కాస్త కఠినంగా, సూటిగా హెచ్చరించాడు.

సీత మాట్లాడలేదు.

తటాలున లేచి, దొడ్డితలుపు తీసుకుని పరుగెత్తింది. ఈ హఠాత్పరిణామానికి కారణం ఊహించలేకపోయినా ఏదో వైపరీత్యం జరుమన్నదనిమాత్రం తోచిం దతనికి. ఆమెన మెరుపులా వెంబడించాడు. బావిలో ఉరకబోతున్న సీతను ఆఖరిఅడుగున పట్టుకున్నాడు.

'నన్ను వదలండి .... నేను ఛస్తాను. బాబు నావాడు కాడని, సంతానయోగం లేదని మీరే అన్నారుగా ! ఇంకా నే నెందుకు బతికి ఉండటం?' అని విదలించుకోబోయింది. వెయ్యి ఏనుగుల బలం ఆ విదలింపులో ఉంది. ఆలోచించేందుకు వ్యవధి లేదు. మనస్సులో ఆశలకు ముందు స్థిరత్వం కలిగించాలి.

'సరే సీతా ! .... బాబు నీవాడే ! .... రా ! పోదాం.'

'నిజంగానా ? .... '

అవు నన్నట్టు తల నిలువునా ఆడించాడు.

సీత తిరిగి వచ్చింది. బాబు కిటికీదగ్గర నిలబడి బయటకు చూస్తున్నాడు. శంకరం వచ్చే ప్రమాదాన్ని ఎదుర్కోటానికి సిద్ధమయ్యాడు. బాబును సీతనుండి వేరుచేయటం సాధ్యంకాదు.

* * *

ఏదైనా వస్తువుమీద మమకారం కలిగి, అది దొరక్కపోతే మతన్నా చెడుతుంది. విరక్తన్నా పుట్టుకుంటుంది. సీతకు పూర్తిగా మనస్తిమితం తప్పకపోయినా, దానికి కొంచెం దూరంలో ఉందని శంకరానికి తెలుసు. ఆమెలో ఎన్ని లోపాలున్నా, మనస్ఫూర్తిగా ప్రేమించాడు. అందుకే కర్తవ్యానికి కూడా జంకాడు, అంతేకాదు. మానవుడు తన అభిప్రాయాల కెన్నడూ స్థిరత్వం యివ్వలేడు. బాబును తనదగ్గరే ఎందుకు ఉంచుకోకూడదన్న ఆలోచన అతనికీ కలిగితీరుతుంది.

ఆ మర్నాడు పొద్దున్న సీత స్నానంచేసి, దేవుడి పటంముందు దీపంవెలిగించి, బాబు కోసం గదిలోకి వచ్చింది. అతను హాయిగా నిద్రపోతూ ఉంటాడని, 'నాయనా ! చిట్టితండ్రీ ! లేవరా' అంటూ తను మేలుకొలుపు పాడాలని ఉబలాటపడింది .... కాని బాబు ఎప్పుడు మేలుకున్నాడో యేమో కాని, కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. తీర్థపుజనం బళ్లమీద ఇళ్లకు తిరిగిపోతున్నారు. ప్రతి వ్యక్తిని అతను పరీక్షగా చూస్తున్నాడు. తండ్రి జాడలకోసం వెదకుతున్నాడుగామోలు !

'బాబూ ! .... కాఫీ తాగుతావా ?' అంది జుత్తు నిమురుతూ.

అతను ఉలిక్కిపడ్డాడు. సీతకేసి భయంగా చూశాడు.


"ఒరేయ్! ఒకగ్లాసుతో నీళ్లు ఇవ్వరా" పైబెర్తులో ఉన్న ప్రయాణీకుడు క్రింద బెర్తులో ఉన్న తన మిత్రుణ్ణి అడిగాడు.

"నీమొహంమండా ! అన్ని నీళ్ళు త్రాగుతున్నావేమిరా ? ఇప్పటి కప్పుడే పదిగ్లాసుల నీరు అందించానుకదా" మిత్రుడు విసుక్కున్నాడు.

"ఆనీళ్ళన్నీ నే త్రాగలేదురా! ఈబెర్తుకి నిప్పంటుకుంటే ఆర్పుతున్నా నంతే" అతడు అమాయకంగా గొణిగాడు.

కె. మోహన్ (గుంటూరు)

తెలుగు పత్రికలన్నిటిలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అధికమైనది




# నిండిన జీవితకలశం

'నాన్నారు ఆ బండిలో ఉంటారు. తీసికెళ్ళ-నాన్నారు' అన్నాడు.

'అలాగే ! .... తప్పకుండా ! ముందు కాఫీ తాగుదువు కాని రా !' అంటూ వంటింటోకి తీసుక పోయింది.

మువ్వల చప్పుడు దూరంనుండి దగ్గరైంది.

'నాన్నారు .... బండిలో .... నాన్నారు' అన్నాడు మళ్ళీ.

శంకరం ఇదంతా జాలిగా చూస్తూ నిల బడ్డాడు.

సీత అతనిముందు చిక్కటి కాఫీ ఉంచింది.... అతను మౌనంగా కూర్చున్నాడు.

'బాబూ ! .... బంగారు తండ్రి !' అంటూ తాగించబోయింది.

'హద్దులుమీరే ఈ ప్రేమ పతను తిరస్క రించాడు.

'పోనీ, పాలు తాగుతావా ? ....'

'ఆ అబ్బాయి నలా ఎందుకు చిత్రవధచేసి చంపుతావ్ ? నీ వెర్రిని నీ దగ్గరే ఉంచుకో' అని కసిరాడు శంకరం.

'పిల్లల పెంపకంగురించి మీ కేం తెలు సండి ? .... ఈ విషయంలో మీరు జోక్యం కలుగ జేసుకోకండి. మరో గంటలో దుకాణాలు తెరు స్తారు. మనబాబుకి నాలుగైదు చొక్కాలు, వంట్లాలు — ఆడుకునేందుకు ఏవైనా బొమ్మలు కొనుక్కురండి. రెండు బిస్కట్ల పొట్లాలు, పిప్పర మెంట్లు—అన్నట్టు బట్టలు మంచివి, సిల్కువి కొనుక్కురండేం ! .... ఈలోగా నేను వంటపని మొదలెడతాను.'

శంకరం ఆమెతో వాదించక తనగదిలోకి పోయాడు. వంటింట్లో సీత ఏవేవో కబుర్లు చెబుతోంది బాబుతో — అతను మాట్లాడు తున్నట్టు లేడు. ఈ నాటకానికి పరిసమాప్తి ఎక్కడ, ఏరూపంలో ఉంటుందో అతని కర్థం కాలేదు. అదేం చిత్రమోకాని, ఆ అబ్బాయి ఏడవటంలేదు. నాన్నదగ్గరకు పోవాలని మారాం చేయటంలేదు.

'నాన్నగారి దగ్గరకు తీసికెళ్ళండి' అంటూ బాబు పరుగెత్తుకువచ్చి శంకరం ముందు నిల బడ్డాడు. వెనకాలే సీత పరుగెత్తుకొచ్చింది.

'ఈ దొంగ కృష్ణుణ్ణి పట్టుకోటం అసాధ్యంగా ఉందండి ! .... రా బాబూ ! బత్తాయిపండో తిందువుగాని' అని లాక్కుపోయింది సీత — శంకరం నిట్టూర్చాడు.

మరో గంటకు చొక్కా తొడుక్కుని బయటి కొచ్చాడు.

అరుగుమీద ఎవరో అపరిచితవ్యక్తి కనిపిం చాడు. శంకరం అతన్ని పరీక్షగా చూసి 'ఏం కావాలి మీకు ? ....' అనడిగాడు.

'మరేం లేదండి .... నేను పొరుగూరివాణ్ణి - ఈ ఊళ్లో శివరాత్రి చూసితీరాలని అందరు అంటే చూసిపోదామని వచ్చాను. మేం పదిమంది బండిలో వచ్చాం. నాతో నా కొడుక్కూడ ఉన్నాడు. బండి దిగి గుడివైపు నడుస్తుంటే

గుంపులో అతను తప్పిపోయాడు. అతనికోసమే వెదకుతున్నా. ఈ ఇంటి అరుగుమీద కూర్చుని ఏం వెతగ్గలనని అడుగుతారేమో ! .... ఎక్కడని వెతకమంటారు ? ఓ నిర్ణీత ప్రదేశమంటూ లేదు. అతను ఎక్కడున్నాడో తెలియదు. అందు కని ప్రతిఇంటి యజమాన్ని అడుగుతున్నా — పోలీసు రిపోర్టుకూడా యిచ్చాను.'

శంకరం గుండె కలుక్కుమంది. ఆ వ్యక్తికి వంభై ఏళ్ల కెక్కువ ఉండదు. అతనిముఖంలో విషాదం ఛాయలు వేసింది. చేతికి రాళ్ల ఉంగరాలు, బంగారు రిస్టువాచి, సిల్కు చొక్కా, శ్రీమం తుడై ఉండాలి.

'అలాగా ! .... అయ్యో పాపం !' అని జాలి పడ్డాడు అందరిలాగే శంకరం.

అతని కళ్లెదుట బాబు కనిపిస్తూనే ఉన్నాడు. అంతరాత్మ చురుక్కున పొడుస్తూనే ఉంది. తప్పిపోయిన అతనికొడుకు బాబే ఎందుకై ఉండాలి ? ప్రతి తీర్థంలోనూ ఎందరో పిల్లలు మాయమవుతూంటారు.

'ఆ అబ్బాయి ఎలా ఉంటాడు ? .... అతని పేరు ?'

ఆవ్యక్తి అరుగుమీదనుండి క్రింద కురికి, పరుగునవచ్చి శంకరంచేతులు రెండూ పట్టు కున్నాడు.

'అతనిజాడ మీకు తప్పక తెలిసే ఉంటుంది. ఎర్రటి శరీరచ్ఛాయ. చూట్టానికి బొద్దుగా, అందంగా ఉంటాడు. వయసు నాలుగు సంవత్స రాలు. మెళ్లో బంగారు గొలుసుంటుంది. అతని పేరు బాబు—చిన్నవాడైనా మంచి ధైర్యస్థుడు. అనవసరంగా ఏడవడు. ఎవర్నీ చూసి జడుసుకోడు.'

శంకరం అతికష్టంమీద నిలబడగలిగాడు. చివరి ఆశాకిరణంకూడా చీకటిపాల పడింది.

'ఒక్క నిముషం ఆగండి .... మా ఆవిణ్ణి కనుక్కువస్తాను. ఈవిషయమై ఆమె చెవిలో ఏదన్నా పడిందేమో అడుగుతా.' అంటూ ఇంట్లోకి పరుగెత్తాడు. ఆకలివేసింది గామోలు, బాబు పాలు తాగుతున్నాడు. సీత 'విజయం నాదే' నన్నట్టు శంకరంకేసి గర్వంగా చూసింది. అతను సంగతి వివరించాడు.

'అతని ముఖం చూస్తుంటే గుండె కరగి పోతోంది. మనం పిల్లల్ని కని పెంచలేదు. కనుక ఆ ఆవేదన ఎలాంటిదో మన కర్థంకాదు. లేని పోని కోరికలు మనకెందుకు ? అన్యాయంగా ఒకరి సొత్తును హరించకూడదు. బాబుని అతనికి అప్పగిద్దాం' అని బ్రతిమాలాడు.

'మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. కాని మీరు తిరిగి వచ్చేసరికి నా శవంమాత్రమే కనిపి స్తుంది'—ఒక్కసారిగా ఆవరించిన ఆవేశంతో బాబుని ముద్దుపెట్టుకుంది. గుండెకు హత్తు కుని గగనవిహారం చేసింది.

శంకరం బయటికొచ్చాడు.

'అడిగారా ? .... ఇంటావిడ ఏమంటోంది ?' అనడిగాడు ఆ వ్యక్తి ఆశగా.

'ఆవిడ తనకేం తెలియదంటోంది. మీరు వెదకిచూడండి. తప్పకుండా కనిపిస్తాడు.'

'నా అదృష్టం ఎలా ఉందో ఏమో మరి. ఈ అడ్రసు మీ దగ్గరుంచుకోండి. ఏమైనా కబురు తెలిస్తే అందజెయ్యండి' అంటూ కాళ్లీడ్చుకుని అతను కదలిపోయాడు. పొంగుతూన్న దుఃఖాన్ని అతి కష్టంమీద శంకరం ఆపగలిగాడు.

సీత పంచభక్ష్యపరమాన్నాలతో బాబుకి అన్నం వడ్డించింది. అతను ఏదో తిన్నాడు. సిల్కు బట్టలు తొడిగి సింగారించింది. కళ్లకు కాటుక పెట్టింది. ముఖానికి పౌడరు అద్దింది. ఎర్రటి జోళ్లు తొడిగింది.—చైతన్యరహితమైన ఓ బొమ్మకు ఆమె చేస్తున్న అలంకరణను చూస్తూ మౌనంగా కూర్చున్నాడు శంకరం. బరువుగా అడుగులువేస్తూ నడుస్తున్న అతని తండ్రి రూపం కళ్లముందు కదలి, శరీరంలో ప్రతి అణువునూ ఆడించివేసింది.

రెండు శిఖరాలమధ్య అతను చిక్కుకున్నాడు. ఎటూ చేరుకోలేడు—మధ్య ఉండనూలేడు.

---

ఇద్దరు వ్యాపారస్థులు కలిసి పెట్టిన దుకాణంలో ఒక గుమాస్తా డబ్బు కాజేస్తున్నట్లు తేలింది.

"ఆ వెధవను పోలీసులకు అప్ప గిస్తేగాని రోగం కుదరదు" భాగ స్వాములలో ఒకడు అన్నాడు.

"ఒరేయ్ ! అదేం మాటరా. మనంమాత్రం అలా పైకివచ్చిన వాళ్ళంకాదూ!" రెండవవాడు గతాన్ని జ్ఞాపకం చేశాడు.

---

'మన అబ్బాయిని అలా షికారు తీసికెడదామా?' అనడిగింది.

'తప్పకుండా ! .... అతన్ని కన్నారికి అప్ప గించి, మనం తిన్నగా శ్రీకృష్ణజన్మస్థానానికి పోదాం' అన్నాడు.

అతని అభిప్రాయం అర్థం చేసుకున్న సీత మరి మాట్లాడలేదు.

'బాబూ ! .... నీ మెళ్లో గొలుసు ఉండేదా ?'—ఆ చిన్నసందేహాన్నికూడా నివృత్తి చేసుకుందా మని అడిగాడు.

'ఉండేది. ఇప్పుడు లేదు. ఎవరో—మరో—దొంగ తెంపుకుపోయాడు.'

'అతను ధైర్యస్థుడు. అనవసరంగా ఏడవడు' అన్న తండ్రి వాక్యాలు తిరిగి వినిపించాయి.

* * *

రెండు రోజులుగడిచాయి.

నాన్నదగ్గరకు పోవాలని బాబు అంటూనే ఉన్నాడు. సీత అనునయిస్తూవచ్చింది. మూడోనా డుదయం బాబు పక్కమీదే పడుకున్నాడు.

'ఒళ్లు వెచ్చగా ఉంది—' అంది సీత.

శంకరం ఏదో వైపరీత్యం వచ్చితీరుతుందని ఎదురు చూశాడు.

'ఏం వచ్చినా, ఫలితం అనుభవించి తీరాలి.' అన్నాడు.

సీత ఏవో మందులు చేసి తాగించింది. సాయం త్రానికి జ్వరం ఎక్కువైంది.

'నాన్నారి దగ్గరకు తీసికెళ్లరా ? ....' అడి గాడు జాలిగా బాబు.

'తప్పకుండా ....' అన్నాడు శంకరం

'నా బాబుకి దిష్టి తగిలింది .... అందుకే ఈ మాయదారిజ్వరం వచ్చిపడింది.' అంటూ దిష్టి తీసింది.

'దిష్టి తగలటానికి బయటివా రెవరూ చూడ లేదుగా !' అనడిగాడు శంకరం.

'మనకళ్లు చాలవూ ? ....' అని సంబరపడింది.

అర్ధరాత్రి శంకరం మేలుకున్నప్పుడు దీపం వెలుగుతూనే ఉంది. సీత బాబునుంచంపక్కన నేలమీద కూర్చుంది. అతను వెళ్లి వంటిమీద చేయివేసి చూశాడు. చురుక్కుమంది. బాబు నిద్రపోవటంలేదు. మధ్యమధ్య కళ్లు తెరచి అటూ ఇటూ బెదురుగా చూస్తున్నాడు.

'బాబూ ! .... బెంగ పెట్టుకోకు. నేనే అమ్మ ననుకో—ఆయనే నాన్నారు. పాతదంతా మర్చిపో! నీకు ఏం కావలిస్తే అది కొనిపెడతాను. చిన్న మోటారు కావాలా ? సైకిలు కావాలా ? .... ఏయేబొమ్మలు కావాలి ? బిస్కట్లు, పిప్పర మెంట్లు, చాకలేట్లు ....' అంటోంది ఆమె.

'సీతా ! .... ఇదేం బాగాలేదు. ఆ అబ్బాయి తండ్రి అడ్రసు నాదగ్గరుంది. రేప్పొద్దున్న వెళ్లి అప్పగిస్తాను. తరువాత పశ్చాత్తాపపడి లాభం లేదు—చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు.'

'మీ రలా చేస్తే ఏం జరుగుతుందో ముందే చెప్పాను. తరువాత మీ ఇష్టం.'

ఇంక ఆమెతో వాదించి లాభంలేదు.

మర్నాడుదయం జ్వరంతీవ్రత అలాగే ఉంది. శంకరం డాక్టర్ని తీసుకొచ్చాడు. అతను పరీక్షించి మాదిపొడిచాడు.

'ఎవరండి ఈ అబ్బాయి ?' అనడిగాడు డాక్టరు.

'మా బంధువుల తాలూకు—పెంచుకుందామని తీసుకువచ్చాను' అంది సీత.

డాక్టరు మందు పంపిస్తానని వెళ్లిపోయాడు.

అరుగుమీద కూర్చుని శంకరం కర్తవ్యం ఆలో చించాడు. గత రెండురోజులుగా అతను బడికి వెళ్లలేదు. ఆనాటికూడా సెలవు చీటీ రాసి పంపాడు. బాబు తండ్రి ఏదో ఏదో ఒకనాడు నిజం కనుక్కోకపోడు. అప్పుడు 'జైలువాసం' తప్పదు. ఇరుగు పొరుగువారు మాత్రం ఊర్కొ కుంటారా ? పునాదులు తవ్వుతారు. 'చుట్టాలి తాలూక' ని సీత తేలిగ్గా అనేసింది. కాని, నిజం దాగదు. బెంగపెట్టుకుని బాబుప్రాణాలు వదిలే స్తాడన్న భయం ఒక్కసారిగా ఆవరించింది. తనకు ఎలాగూ పిల్లలు లేరు మంొకరి సొత్తును అపహ రించి అనుభవించే దేమిటి ? .... పరపర లోపలకు వెళ్ళాడు.

'నేను బడికి వెడుతున్నా — డాక్టరు మందు పంపుతాడు — బాబుకు వేళ తప్పకుండా ఇవ్వాలి. జాగ్రత్తగా చూస్తూ ఉండు. ప్రమాదిస్తే మాత్రం డాక్టరుకు కబురంపు.'

'బాబు కిలా ఉన్నప్పుడు బడికెందుకండీ వెళ్లటం ? సెలవు పెట్టకూడదూ ?'

'పిల్లేదు' అని బయలుదేరాడు.

బడికి కాదు. బస్సు స్టాండుకు.

* *

పన్నెండు గంటలకు శంకరం వెళ్లేసరికి, బాబు తండ్రి అరుగుమీదే ఉన్నాడు.

'రండి ! .... రండి ! .... ఆనాడు మిమ్మల్ని చూసినప్పుడే అనుకున్నా. తప్పకుండా వస్తారని. నాకూ్కడా కొన్ని వివరాలు తెలిశాయి. మా అబ్బాయి తప్పిపోయిన మర్నాడు పోలీసులు ఓ దొంగను పట్టుకున్నారు. వాడి దగ్గర బాబు గొలుసు దొరికింది. అబ్బాయిని ఊరి బయట వదిలేసినట్లు [illegible]

[illegible] మా అబ్బాయి ప్రస్తుతం మా యింటో ఉన్నాడు.'

శంకరం ఇంకా ఏదో చెప్పబోతుంటే, విని పించుకోక అతన్ని లాక్కుంటూ లోనికి పరుగెత్తాడు.

'ఏమే ! .... బాబు దొరికాడు. దొరికాడు' అనరిచాడు.

మంచంమీద పడుకున్న అతని భార్య లేచి కూర్చుంది. ఇంచుమించు శంకరం కళ్లకు ఆమె సీతలాగే కనపడింది.

'ఈయన ఇంట్లో ఉన్నాడుట .... చూడండి ! పెళ్లైననాటినుండి ముక్కు పీది ఎరుగదు. అలాంటిది, బాబు తప్పిపోయాడని తెలియగానే మంచంపట్టింది. ఒక్కగా నొక్క కొడుకు. పంచప్రాణాలూ అతనే మాకు' అన్నాడతను.

'మరో వారం రోజులకు నా తండ్రి కనిపించక పోతే నేను బతికి ఉండను. మీరు దేవుడిలాంటివారు. నాకు వెలుగు చూపించారు.' అంది బాబు తల్లి.

'పిచం ! .... మీరు నిజంగా ఆ నీలకంఠులే !' అంటూ శంకరం చేతులు రెండూ పట్టుకుని కృతజ్ఞత వెల్లడించాడు బాబు తండ్రి.

'వెంటనే బయలుదేరండి....పోదాం — అతనికి కొద్దిగా జ్వరంగా ఉందికూడా.' అని హెచ్చరించాడు శంకరం.

భార్యను జాగ్రత్తగా ఉండమని హెచ్చరించి బయలుదేరాడు.

* * *

బాబుతండ్రితో శంకరం బస్సు దిగేసరికి అయిద్దైంది.

కిళ్లీకొట్టు దగ్గర ఇద్దరునిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

'ఆ అబ్బాయికి నాలుగేళ్లుంటాయట. రెండు రోజులుగా ఒక్కటే జ్వరమట, మధ్యాహ్నం పోయాడు.'

# నిండిన జీవితకలశం

'అలాగా ! పాపం ! .... రెండు రోజుల జ్వరంతో పోయాడంటే ఏదో కారణం ఉండితీరాలి.'

'ఎవరికోసమో బెంగపెట్టుకున్నాడట !'

శంకరం కాళ్లు తేలిపోయాయి. కూడా వస్తున్న బాబు తండ్రి ఆ సంభాషణ విన్నట్లు లేదు. అతని కేంచేయాలో పాలుపోలేదు. అతను విన్నమాటల్లో అబ్బాయి నిజంగా బాబైతే తను తండ్రికి ఏం సమాధానం చెప్పాలి ? చంపింది తనేనని అంతరాత్మ చెబుతుంది. కాని దానికి నోరు లేదు కనుక పైవార్ని నమ్మించలేదు. కాని జీవితాంతం తనను దొలిచివస్తుంగి

"బెజవాడకు $1\frac{1}{2}$ టిక్కెట్లు ఇవ్వండి" మనమడితో వచ్చిన తాతగారు టిక్కెట్లు ఇచ్చే గుమాస్తాకు డబ్బు ఇచ్చి అడిగారు.

గుమాస్తా తాతగారి వెంట ఉన్న కుర్రాణ్ణి ఎగాదిగా చూసి "ఆ కుర్రాడు పొడుగు లాగు తొడుక్కున్నాడు గదా! అర టిక్కెట్టు తీసుకుంటారేం. నిండు టిక్కెట్టు తీసుకోండి" సలహా చెప్పాడు.

"బాపుందిసీ సలహా! ఆ లెక్కన నేను అసలు టిక్కెట్టే తీసుకోనక్కరలేదు." తాతగారు చమత్కరించారు.

వి. ఆర్. (మద్రాసు)

శంకరం ఇల్లు చేరుకునేసరికి వీధి గుమ్మం దగ్గర సీత కనిపించింది.

ఆమె చేతుల్లో బాబు — అతను తెల్లబోయాడు.

'రండి ! .... మీ కోసమే ఎదురుచూస్తున్నా' అని భర్తను ఆహ్వానించింది.

'సీతా ! .... ఈయనే ఆ అబ్బాయి తండ్రి' అనేలోగా బాబు నాన్నచేతుల్లో ఉన్నాడు. దృశ్యాన్ని ఆనందపారవశ్యంతో సీత చూస్తుంటే, శంకరం అయోమయంగా చూశాడు. ఏవిటీ మార్పు ? .... ఎడారి ఒక్క క్షణంలో పూలతోట్లైనట్టు—రెండునిమిషాలు గడిచాయి.

'జ్వరం సందడ్రిగిలకు పైనే ఉంటుంది.... డాక్టరుకు చూపించి మందిప్పిస్తున్నాం. మీరు లోపలకు రండి' అంది సీత.

'నన్ను క్షమించండి. మీ ఆదరణను తిరస్కరిస్తున్నా ననుకోవద్దు. బాబుకోసం మా ఆవిడ క్షణ మొకయుగంలా ఎదురుచూస్తూ ఉంటుంది. బెంగపెట్టుకోటంవలన వచ్చిన జ్వరమే ఇది... కంగారుపడేందు కేమీ లేదు. రేపటికి నవ్వుతూ కులాసాగా ఉంటాడు. అదీకాక, ఆఖరిబస్సు ఏడింటికి—కనక నేను సెలవు తీసుకుంటాను.... మీ రిద్దరూ ఉమా శంకరులు. అందులో సందేహం లేదు. అందుకే నా బాబును ఆదరించి, సంరక్షించి నాకు అప్పగిస్తున్నారు. మీ రుణం జన్మజన్మాంతరాలకు తీర్చుకోలేను..... బాబు జ్వరం తగ్గటంతోనే, ముగ్గురం కలిసి మిమ్మల్ని కలుసుకునేందుకు వస్తాం .... బాబూ ! .... పెదనాన్నకు, పెద్దమ్మకు దండంపెట్టు' అన్నాడు.

జ్వరంతో ఉన్న బాబు చిన్నగా నవ్వాడు.

'పోలీసులకు ఈ విషయం తెలియజేయండి.... లేకపోతే వాళ్లు అనవసరంగా వెదకుతూంటారు.' అని హెచ్చరించాడు శంకరం. బండి కట్టించి సాగనంపాడు.

సీత కళ్లు తుడుచుకుంది.

'అది సరేకాని' సీతా ! .... బాబును వదులుకోటంకంటే, నూతిలోపడి ప్రాణాలు వదిలేస్తా నన్నావుగా ! .... ఒక్కసారిగా ఇలా ఎలా మారిపోయావు ?'

సీత నిండుగా, గంభీరంగా, నవ్వింది.

'వివేకమనేది శాశ్వతంగా నిద్రపోదంటారు నేను మొండిపట్టు పడితే, బాబు దక్కేవాడు కాడు. మనకు ఎలాగూ సంతానం లేదు. మరొకరి రత్నాన్ని బలవంతంగా లాక్కుని మట్టిలో కలపటం మహా పాపం. దాన్ని ఆ శివుడుకూడా సహించడు. ఓ గొప్పపని చేసినందుకు నాకెంతో గర్వంగా ఉంది. పిల్లల్ని కనకపోయినా తల్లి ప్రేమ ఎలాంటిదో నాకు తెలుసు. బాబుకోసం అతన్ని కన్నతల్లి ఎంతగా ఏడుస్తుందో ఊహిస్తే నాకు భయంవేసేది..... మనకు పిల్లలు లేకపోయినా ఫరవాలేదు. ఉన్నవాళ్లయినా కలకాలం హాయిగా ఉండాలని ప్రార్థించటం మంచిది.' శంకరం ఆమెకేసి చిత్రంగా చూశాడు.

'కాని సీతా ! .... ఎందుకో, మనకూ్కడా ఓ బాబు పుడతాడన్న నమ్మకం నాకు కలుగుతోంది.'

సీత ఆమాటలు వినిపించుకోలేదు.

బాబుతో దూరమవుతున్న ఆ బండికేసి మలుపు తిరిగేదాకా చూస్తూ నిలబడింది.

వీధిదీపాలు ఒక్కసారిగా వెలిగాయి.

ఆయేటి శివరాత్రితీర్థం అతని జీవిచరిత్రలో శాశ్వతస్థానం సంపాదించుకుంది.